క్లుప్తంగా

ఇద్దరు గౌడ సంఘ నేతలకు రాష్ట్ర బీసీ సంఘంలో చోటు



వీర్రాజు, చందులకు నియామక పత్రాలను అందించి, అభినందిస్తున్న ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: మండలంలోని ఇద్దరు గౌడ సంఘ నేతలకు రాష్ట్ర బీసీ సంఘంలో చోటు దక్కింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పంగిడిగూడెంకు చెందిన పరసా వీర్రాజును బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, తిరుమలంపాలెంకు చెందిన మిడతా చందు గౌడ్‌ను కార్యదర్శిగా ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నియమించారు. ఆ సమయంలో ఆయన జారీ చేసిన నియామక పత్రాలను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం వీర్రాజు, చందులకు అందించి అభినందించారు. బీసీ సంఘ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో నల్లజర్ల నరసింహారావు, అద్దంకి వెంకటేశ్వరరావు, వెలిగట్ల ఫణికుమార్, అద్దంకి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

జగన్ పాలనలో ఇంటికే సంక్షేమ లబ్ధి



రావికంపాడులో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన వారికి నేరుగా ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మంగళవారం రావికంపాడులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగరవేసి, గ్రామానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ, మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందజేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి గ్రామ సచివాలయ వలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కనుమూరు అంజిరెడ్డి, సచివాలయ కన్వీనర్ షేక్ మీరా సాహెబ్, మెదురి రంగబాబు, కోటగిరి శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల ధర్నా

కొయ్యలగూడెం: ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ కూలీలు మంగళవారం మంగపతిదేవిపేటలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల వేతనాలను నాలుగు నెలల నుంచి చెల్లించడం లేదని, ప్రభుత్వాలకు ఇది సరైనది కాదని అన్నారు. వెంటనే ఉపాధి హామీ కూలీల వేతనాలను విడుదల చేయాలని కోరారు. అబ్బు సుబ్రహ్మణ్యం, తేలే శ్రీనివాసరావు, ఇళ్ల నరసయ్య, కట్ట మహాలక్ష్మయ్య, చిక్కాల రమణమ్మ, దాసరి అంకాలమ్మ, పల్ల సత్యవతి, మామిళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

కొయ్యలగూడెం: పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని కొయ్యలగూడెం డీవైఈవో రామన్న దొర ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం డీవైఈవోను ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అయ్యేలా కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర, ఉపాధ్యక్షుడు ఎస్.దొరబాబు, కొయ్యలగూడెం మండల శాఖ అధ్యక్షుడు ఎం.వరకుమార్, గౌరవ అధ్యక్షుడు బీపీ అబ్బులు, సబ్ కమిటీ సభ్యులు యంబీ త్రిపురేశ్వరి, ఎం.సరితకుమారి, వెంకటలక్ష్మి, ఇందిరా కుమారి పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

చింతలపూడి: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడి పందేలపై చింతలపూడి పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్సై కె ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం గణిజర్ల గ్రామంలో కోడి పందేలపై పోలీసులు దాడి చేసి 5గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి నాలుగు కోడి పుంజులు, కోడి కత్తి, రూ.6,200 స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా సీతానగరం గ్రామంలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రూ.3,800, ఒక కోడి పుంజు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'గడపగడపకు' నిధులతో మారుతున్న రూపురేఖలు

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



అచ్చియ్యపాలెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కంద్రికగూడెం, అచ్చియ్యపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు సుమారు రూ.40 లక్షల నిధులు కేటాయించారన్నారు. ఆ నిధులతో పనులను చేపట్టి ప్రారంభోత్సవాలు చేయడం కూడా ఆనందంగా ఉందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో జరిగిన పనుల వల్ల నియోజకవర్గంలోని గ్రామాల స్వరూపం మారిందన్నారు. అలాగే ప్రధాన రహదారులుగా ఉన్న ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అలాగే కాంట్రాక్టర్లు కూడా పనులు ప్రారంభించారని చెప్పారు. పోలవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో రూపురేఖలు మారిపోతున్నాయని అన్నారు. పోలవరం నియోజకవర్గంలో ఉన్న జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మీదుగా పట్టిసీమ వరకూ నేషనల్ హైవే 365 బీబీ నాలుగులైన్ల రోడ్డు నిర్మాణం పనులు కూడా జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరరావు, పొడియం లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సయ్యద్ బాజీ, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.శారాశాంతి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలతో సత్ఫలితాలు

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామ స్థాయిలో ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి చేకూరేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని అచ్చియ్యపాలెం, నూతిరామన్నపాలెంలో నిర్మించిన నూతన సచివాలయ భవనాలను, విలేజ్ క్లినిక్‌ను ఎమ్మెల్యే బాలరాజు, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు విలేకరులతో మాట్లాడుతూ రేషన్ కార్డు మొదలుకుని పలు రకాల ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా సచివాలయ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందన్నారు. గతంలో ఏ పని కావాలన్నా ప్రజలు సుదూరాన ఉన్న మండల కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, ప్రజల ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. నేడు ఈ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరరావు, పొడియం లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కోఆప్షన్ సభ్యులు షేక్ సయ్యద్ బాజీ, ఎంపీడీఓ ఎస్. వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ ఎస్. శారాశాంతి, నాయకులు కె.విజయరామరాజు, సోదెం సుధాకర్, ధినేష్, ఎన్ఎస్‌వి వెంకట్రావు, పెంటపాటి శ్రీను, రవ్వా నాగు, బానోతు శ్రీరామ్‌మూర్తి, బి.బాబూరావు, కాంట్రాక్టర్ త్రిమూర్తులు, దుర్గారావు, శివబాబు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పోలవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మికి అభినందనలు



తెల్లం రాజ్యలక్ష్మికి, ఎమ్మెల్యే బాలరాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సతీమణి రాజ్యలక్ష్మిని నియమించినట్లు పార్టీ అధిష్టానం ప్రకటించడంతో మంగళవారం రాత్రి దుద్దుకూరులో వారి ఇంటి వద్ద సందడి నెలకొంది. అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజ్యలక్ష్మిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. కేక్‌లు, మిఠాయిలు పంచారు. తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, పార్టీ జిల్లా కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి రాజ్యలక్ష్మి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

ద్వారకాతిరుమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి పింఛన్ల కానుక పంపిణీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొంటారని, లబ్ధిదారులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

టి.నరసాపురం: అయోధ్య నుంచి వచ్చిన బాలరాముని అక్షింతలు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో టి.నరసాపురం రామాలయం కమిటీకి అందాయి. ఈ నేపథ్యంలో సోమవారం అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశాల్లో ఉంచి గ్రామోత్సవం జరిపారు. అనంతరం అక్షింతలను గ్రామాల వారీగా రామాలయ కమిటీలకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పర్వతనేని మురళి, పసుమర్తి రాములు ఆధ్వర్యం వహించారు.

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య బాలరాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ మాట్లాడుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆలయానికి చేరుకున్న అయోధ్య బాలరాముడి అక్షింతలను పట్టణంలోని ప్రతి దుకాణ సముదాయం, నివాసాలకు కమిటీ సభ్యులు స్వయంగా వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహన్‌రావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యుగంధర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సభ్యులు కొనకళ్ల వెంకటేశ్వరరావు, జల్లిపల్లి శివకృష్ణ, నీలం మధు, మోతుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



మంగపతిదేవిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న జేడీ మోహనకృష్ణ

కొయ్యలగూడెం: మండలంలోని మంగపతిదేవిపేట సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ మోహన కృష్ణ ఈ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం పేదలకు వరం అని అన్నారు. ముఖ్యంగా కేన్సర్, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎంతోమందికి ఇది ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఓపీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొయ్యలగూడెం యూజీ పీహెచ్‌సీని సందర్శించి ఆసుపత్రి ప్రసవాలు పెంచాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేథరిన్, ఇన్‌చార్జి డీఎంఓ డాక్టర్ సురేష్, డాక్టర్ పూర్ణ చంద్రరావు, డాక్టర్ ఎస్తేర్ రాణి, డాక్టర్ తస్లీమా, సీహెచ్‌ఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎ.పోలవరంలో...

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని ఎ.పోలవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు ప్రజలకు వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంగా జీవించడానికి పాటించాల్సిన జాగ్రత్తలను వైద్యులు శిబిరానికి వచ్చిన ప్రజలకు వివరించారు. సర్పంచ్ బుద్దాల సీతారామరాజు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్, ఎంపీటీసీ పసుపులేటి వరలక్ష్మీ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత షెడ్యూల్‌ను మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ మంగళవారం ప్రకటించారు. ఈ నెల 3వ తేదీన జంగారెడ్డిగూడెంలోని బుట్టాయగూడెం రోడ్‌లో గల సచివాలయం పరిధిలో స్థానిక చంద్రశేఖర ఫంక్షన్ హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పాల్గొంటారని చెప్పారు. అలాగే 10వ తేదీన కేశవపల్లి వారి వీధి సచివాలయం పరిధిలో ఫౌండేషన్ ప్లస్ స్కూల్, 17న బాబు జగ్జీవన్‌రామ్ సచివాలయం పరిధిలో ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణ, 24న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం పరిధిలో రోటరీ కమ్యూనిటీ హాల్, 31న రామచంద్రాపురం సచివాలయం పరిధిలో బాలికల హైస్కూల్, ఫిబ్రవరి 7వ తేదీన రాజులకాలనీ సచివాలయం పరిధిలో బాలికల హైస్కూల్, గౌరీశంకరపురం సచివాలయం పరిధిలో 14న ఆర్యవైశ్య కళ్యాణ మండపం, 21న అశ్వారావుపేట రోడ్డు-1 సచివాలయం పరిధిలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం, 28న అశ్వారావుపేట రోడ్డు-2 సచివాలయం పరిధిలో స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మార్చి 6న డాంగే నగర్ సచివాలయం పరిధిలో సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు.

శ్రీవారి గ్రామోత్సవం



ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీవారి క్షేత్రంలో ఉభయదేవేరులు, గోదాదేవితో స్వామివారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆఫీసర్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కె.అద్దయ్య, డీఎస్పీ ఎం.ధనుంజయుడు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గవర్నమెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (జీవోఏ)ను పునరుద్ధరించి, అభివృద్ధి చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, డీఎస్పీ ఎం.ధనుంజయుడు అన్నారు. మంగళవారం స్థానిక అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షులుగా ఆర్డీవో, డీఎస్పీ మాట్లాడుతూ అసోసియేషన్‌ను రెన్యువల్ చేసి మున్సిపాలిటీకి కట్టాల్సిన ఆస్తి పన్ను చెల్లించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి ఆస్తి పన్ను ఎంత కట్టాలో నిర్ణయిస్తామన్నారు. అలాగే అసోసియేషన్ మనుగడకు కొంత నిధులు కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా శాఖల హెచ్‌వోడీలు ఆయా కార్యాలయ సిబ్బంది వివరాలను అసోసియేషన్‌కు అందించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు కూడా అసోసియేషన్‌లో భాగం పంచుకోవాలన్నారు. అలాగే సంక్రాంతికి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు. సమావేశంలో రవాణాశాఖాధికారులు ఎండీ మదని, కె.శివప్రసాద్, ఏడీఏ బుజ్జిబాబు, డీఎల్‌డీవో ఎం.రాజు, డీఎల్ఎఫ్‌వో మహ్మద్ రజావుల్లా, రాజా శ్రీను, ఏవోలు చెన్నకేశవులు, పోశారావు, ఎంఈవో రాముడు, డాక్టర్ వజ్రకిరణ్, హార్టీకల్చర్ అధికారి ధీరజ్ లక్ష్మణ్, పశుసంవర్ధక శాఖ ఏడీఏ పీఎస్‌వీ శేఖర్ దొర తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక కమిటీ ఏర్పాటు

కొత్త కార్యవర్గం ఏర్పాటు అయ్యే వరకు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా ఎంవీఐ కె.శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా హార్టీకల్చర్ అధికారి ధీరజ్ లక్ష్మణ్, కార్యదర్శిగా కేవీఎస్ పోశారావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.సునీల్‌కుమార్, కోశాధికారిగా డిప్యూటీ తహసీల్దార్ రమేష్, కార్యవర్గ సభ్యులుగా బుజ్జిబాబు, ఎంఈవో రాముడు, డాక్టర్ ఎ.అశోక్ నియమితులయ్యారు.

నారాయణపురంలో సంక్రాంతి సంబరాలు



ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు

ద్వారకాతిరుమల: మండలంలోని నారాయణపురంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెద్దిన దిలీప్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. గ్రామంలోని మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని రహదారిపై రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిగా దంపనబోయిన దివ్యశ్రీకి ఫ్రిజ్, ద్వితీయ బహుమతిగా దంపనబోయిన లక్ష్మికి గ్రైండర్, తృతీయ బహుమతిగా కొటారు జయలక్ష్మికి మిక్సీ, నాల్గవ బహుమతిగా గరికిపాటి గంగాభవానీకి కుక్కర్ సెట్, ఐదవ బహుమతిగా దంపన ధనరేవతికి పాన్‌సెట్, ఆరవ బహుమతిగా మార్గాని ప్రవల్లికకు డిన్నర్ సెట్ లను అందజేశారు. అనంతరం విజేతలను ఎమ్మెల్యే తలారి ప్రత్యేకంగా అభినందించారు. సంక్రాంతి సంబరాలను ప్రతీ గ్రామంలోను నిర్వహించాలని, ఇవి పండుగ విశిష్టతను భావితరాలకు తెలియజేస్తాయని ఎమ్మెల్యే తలారి అన్నారు. పండుగ రోజుల్లో యువత జూద క్రీడలకు దూరంగా ఉండి, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ శేషమ్మ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొన్నూరి జాను, భోగరాజు చిన్ని, భోగరాజు సాయికృష్ణ, దాసరి రాంబాబు, మల్లెపూడి నాగమణి తదితరులున్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

ద్వారకాతిరుమల: పాడి రైతులు అపోహలు వదిలి తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని ఏలూరు జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.నెహ్రూబాబు అన్నారు. రామన్నగూడెంలో 32వ విడత గాలి కుంటు వ్యాధి నివారణా టీకాల (ఎఫ్ఎండీసీపీ) కార్యక్రమాన్ని మంగళవారం నెహ్రూబాబు ప్రారంభించారు. గ్రామంలోని 520 గేదెలు, 170 ఆవులకు వైద్యులు టీకాలు వేశారు. ఈ సందర్భంగా నెహ్రూబాబు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 2 నుంచి 31 వరకు జరుగుతుందని, పశు వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పాడి పశువులకు ఈ టీకాలను ఉచితంగా వేస్తారన్నారు. అనంతరం నిర్వహించిన పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో ఏలూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.గోవిందరాజు పాడి రైతులకు పశుపోషణలో మెళుకువలను వివరించారు. భీమడోలు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్, ద్వారకాతిరుమల మండల పశువైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

112 పశువులకు టీకాలు

కొయ్యలగూడెం: గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం కొయ్యలగూడెంలో ఎంపీపీ గంజిమాల రామారావు ప్రారంభించారు. 112 పశువులకు టీకాలు వేశారు. పశువైద్యాధికారి డా. బీఆర్ శ్రీనివాసన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు



జంగారెడ్డిగూడెం: సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్రికెట్ ఆడుతున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం రూరల్: వేగవరంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. వేగవరం, శ్రీనివాసపురం, చక్రదేవరపల్లి, గురవాయిగూడెం గ్రామాల్లో పాఠశాలల క్రీడా మైదనాల్లో ఈ పోటీలు నిర్వహించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో కె. విజయ్‌ప్రసాద్, సీఐ రాజేష్ క్రీడా పోటీలను వీక్షించారు. క్రీడాకారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు కరచాలం చేసి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బాబ్జి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం - ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బుద్దాల సీతారామరాజు, లక్కాబత్తుల నాగరాజు, యడపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జంగారెడ్డిగూడెం పట్టణంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మంగళవారం కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగిన పురుషుల క్రికెట్ పోటీల్లో 3 సచివాలయాల పరిధిలో 5 మ్యాచ్‌లను నిర్వహించారు. మొత్తం 10 జట్లు పాల్గొనగా, 3 జట్లు విజేతలుగా నిలిచాయి. గెలిచిన జట్లు మండల స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటాయని మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ పీడీ జయరాజు, వివిధ శాఖల సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


రేపు జంగారెడ్డిగూడెంలో బాలోత్సవం



బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఈ నెల 4వ తేదీన మొట్టమొదటి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ్ ఏలూరు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బి.నరసింహారావు, స్థానిక బాలోత్సవ్ గౌరవాధ్యక్షుడు మానవతామూర్తి తెలిపారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలో బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని అన్ని యాజమాన్యాల్లోని విద్యాసంస్థల్లోని 2 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో బాలోత్సవం జరుగుతుందన్నారు. ఇది చిన్నారుల పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో 9 రకాల అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. అకడమిక్ అంశాల్లో క్రియేటివ్, మెమరీ టెస్ట్, ఉపన్యాసాలు, క్విజ్, చిత్రలేఖనం, కల్చరల్ అంశాల్లో కల్చరల్, కోలాటం, బృందగానం, పాటలు, నృత్యాలు చిన్నారులకు నేర్పే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. స్థానిక విద్యావికాస్ మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ వజ్రకిరణ్, ఉమర్‌ఆలీ, లయన్స్ గవర్నర్ అట్లూరి సురేష్, కె.హనుమంతరావు, కేవీ నాగేశ్వరరావు, చోడే ఫణిచంద్రశేఖర్, కొండపల్లి పండు, కె.సూర్యారావు, పి.వెంకన్నబాబు, నంబూరి రామచంద్రరాజు, కేమిశెట్టి మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరన్న జయంతి



వీరన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి స్థల దాత మొగ్గళ్లపు వీరన్న 115వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వీరన్న కుమారుడు మొగ్గళ్లపు వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వీరన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆసుపత్రిలోని శానిటైజేషన్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికీ దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, స్టేట్ బయో మెడికల్ ఇన్‌చార్జి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు. ప్రదీప్ కుమార్ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి ట్రామా కేర్, ఈఐసీయూ ఏర్పాటు చేయడానికి అవసరం అయ్యే స్థలాన్ని చూసి, నిర్మాణం జరిగే విధంగా చూస్తానని పేర్కొన్నారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, ఇతర వివరాలను ప్రదీప్‌కుమార్‌కు సూపరింటెండెంట్ బీబీ కమల, ఏఈ మెంబెర్ బావనరుషి తెలియజేశారు. ఏఓ భార్గవ్, నర్సింగ్ సూపరింటెండెంట్ సామ్రాజ్యం, హెడ్ నర్స్‌లు, సత్యసాయి ట్రస్ట్ సేవకులు పాల్గొన్నారు.